

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 12 జూలై 2026 పేజీలు : 04


# ఇద్దరు బైక్ దొంగలు అరెస్ట్

- 25 ద్విచక్ర వాహనాల స్వాధీనం..
- బైక్ల విలువ రూ.19 లక్షలు..



పట్టుబడిన బైక్ దొంగలతో అడిషనల్ ఎస్పి మహబూబ్ బాషా సిఐ పుల్లయ్య సిబ్బంది



రికవరీ చేసిన బైక్ లను చూపుతున్న పోలీసు అధికారు

**అనంతపురం క్రైమ్ జూలై 11 ప్రభాతవార్త**

నకిలీ తాళాల సాయంతో ఇళ్లు, ఆసుపత్రులు, ఇతర రద్దీ ప్రదేశాల్లోపార్కింగ్ చేసి ఉన్న మోటార్ సైకిల్ లను దొంగతనం చేసిన ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి వారి నుండి 25 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం నగరంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పీ మహబూబ్ బాషా సిఐ పుల్లయ్య, మాట్లాడారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ అనంతపురం నగరం, కళ్యాణదుర్గం రోడ్డు లోని నందమూరి నగర్ కు చెందిన బండారు మురళీకృష్ణ, ఇదే అనంతపురంలోని ఆర్కే నగర్ కు చెందిన హున్నూరు షేక్ అలీ అక్బర్ లు ఇద్దరూ కలిసి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో టూవీలర్లు దొంగతనాలకు పాల్పడేవారన్నారు. అనంతపురం నగరం తో పాటు కదిరి తాడిపత్రి గుంతకల్లు పెనుగొండ ఆత్మకూరుతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు పట్టణాల్లోనూ, పలు నగరాల్లోనూ నకిలీ తాళం చెవిలతో చాకచక్యంగా టూవీలర్లను తస్కరించేవారున్నారు. ఇళ్ళ ముందు ఆసుపత్రుల, ముందు ప్రభుత్వ కార్యాలయాలు, ముందు, ఇతర రద్దీ ప్రదేశాల్లోనూ పార్కింగ్ చేసి ఉన్న బైక్ లను సులువుగా దొంగతనం చేసి వాటి ద్వారా జల్సాలు చేసేవారన్నారు.

బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముఖ్యంగా జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేక చొరవ తీసుకొని సదురు దొంగలను పట్టుకునేందుకు కృషి చేశారు. ఇందులో భాగంగానే జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం ఇన్చార్జి డిఎస్పి, అడిషనల్ ఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో అనంతపురం టు టౌన్ సిఐ పుల్లయ్య ఎస్సైలు చంద్రబాబు రామకృష్ణ పోలీస్ సిబ్బంది తమకు రాబడిన ప్రకాశ సమాచారంతో శనివారం ఉదయం నాయక్ నగర్ రైల్వే గేట్ దగ్గర వాహనాలు తనిఖీ చేయుచుండగా ప్రసన్నాయన పల్లి రైల్వే స్టేషన్ వైపు నుండి ఒక మోటార్ సైకిల్ పై ఇద్దరు నిందితులు అటువైపు అనుమానాస్పదంగా రావడానికి చూసి విచారించగా వారి విచారణలో ఇద్దరు వ్యక్తులు జల్సాలకు అలవాటు పడి చోరీలు చేసే వారమని అంగీకరించాలన్నారు. వారిని అరెస్టు చేసి వారి నుండి సుమారు 19 లక్షల రూపాయల విలువ చేసే 25 మోటార్ సైకిల్ లను రికవరీ చేశామన్నారు. ఈ కేసును సవాలుగా స్వీకరించి రికవరీ చేయడంతో పాటు ఇద్దరు దొంగలు అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన అడిషనల్ ఎస్పీ మహబూబ్ బాషా, టూ టౌన్ సీఐ పుల్లయ్య, టూ టౌన్ ఎస్ఐలు రుశేంద్రబాబు రామకృష్ణ, సిబ్బంది అమరేశ్వర రావు, రమేష్ నాయక్, వన్నూరప్ప, పాండవ సుధాకర్, అంజన్ కుమార్, రామాంజనేయులను జిల్లా ఎస్పీ జగదీష్ ప్రశంసించారు.

# శిథిలావస్థకు చేరిన వ్యాసరాయలు మండపం

- ❖ విజయనగరరాజుల రాజగురువు వ్యాసరాయలు
- ❖ వ్యాసరాయలు పై ఉన్నగౌరవంతో రాజుల పేరులో రాయలు చేర్చారు
- ❖ మండపం పునరుద్ధరించి రాయలకీర్తిని నిలబెట్టాలంటున్న ప్రజలు
- ❖ పునర్నిర్మానంపై మంత్రి సవితమ్మ,ఎంపీ బీకే పార్థసారథిలు దృష్టి సారించాలి



శిథిలావస్థలో ఉన్న వ్యాసరాయల మండపం



వ్యాసరాయల మహర్షి

**పెనుకొండ జూలై11 ప్రభాతవార్త**

దక్షిణ భారతదేశంను పాలించిన శక్తివంతమైన రాజ్యాలలో విజయనగర సామ్రాజ్యం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక,తమిళనాడు, ప్రాంతాలని విజయనగర రాజులు ఈప్రాంతాల్ని పరిపాలించడం జరిగింది. విజయనగర రాజుల వంశానికి రాజగురువైన వ్యాసరాయల మహర్షి పటిష్టమైన రాజ్యాన్ని నిర్మించడంలో కీలకమైన పాత్ర పోషించడమే కాకుండా పెనుకొండ ప్రాంతంను విజయనగరరాజుల రెండవ రాజధానిగా తిరుగులేని రాజ్యాన్ని ఏర్పరిచారు. పెనుకొండలో 365 దేవాలయాలని నిర్మించి శక్తి ప్రాంతంగా చరిత్ర పుటలలో ఈప్రాంతం నిలిచిపోయేలా చేశారు. మౌర్యుల కాలంలో ఈప్రాంతాన్ని గఘనాచలం గాను, కాకతీయుల కాలంలో ఘనగిరి గాను, విజయనగర రాజుల కాలంలో పెనుకొండగా ఈప్రాంతం కీర్తిని గడించింది. వ్యాసరాయల మహర్షి శత్రుదుర్భేద్యంగా ఈ రాజ్యాన్ని నిర్మించడంలో తన శక్తులన్నిటిని నిక్షిప్తంచేసి అనేక శక్తివంతమైన దేవాలయాలని ఇక్కడ నిర్మించడం జరిగింది. అందులో నేటికీ చాలా దేవాలయాలు నిత్యపూజలు అందుకుంటూ ఆ ఆలయం యొక్క ప్రాశస్తం వల్ల ప్రఖ్యాతి చెందాయి. వ్యాస రాయల మహర్షి ఇక్కడ దేవాలయాలని శక్తివంతంగా రూపుదిద్దుకోవడం లోనే కాకుండా ఆ ఆలయంలో ఉన్న మూల విగ్రహాలకు కూడా తన యొక్క దివ్య శక్తుల వల్ల శక్తివంతంగా రూపుదికొనేలా విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన రాజులు కూడా ప్రతి ఒక్కరూ ఆయన గౌరవార్థం వారి పేరు చివర రాయలు అని వచ్చేలా పేరు పెట్టుకున్నట్లు చరిత్ర చెబుతోంది. వ్యాస రాయ మహర్షి రాజగురువుగా విజయనగర సామ్రాజ్యం ఎదుగుదలలో కీలక పాత్ర పోషించడమే కాకుండా దక్షిణ భారతదేశం అంతట ఆయన పర్యటించి ఎన్నో దేవాలయాలని నిర్మించారు.

పెనుకొండలో వ్యాసరాయల మహర్షి ధ్యానం చేసుకుని యజ్ఞహోమాలు చేసుకొని విజయనగర రాజ్యంలోకి ప్రవేశించేవారు అని ఈనిబంధనను ఆయన పాటించారు అని తెలుస్తోంది, ఆ మండపం ఇప్పుడు శిధిలావస్థలో ఉన్నది. విజయనగర రాజులు కూడా వ్యాసరాయ మహర్షిని మేళ తాళాలతో ఊరేగింపుగా సాధర ఆహ్వానంతో విజయనగర సామ్రాజ్యంలోకి పిలుచుకొని వచ్చేవారు అని, ఆయన ఆ మండపంలో నివాసం ఉండడమే కాకుండా ఎన్నో హోమాలు యజ్ఞాలు కూడా చేయించారు అని చరిత్ర ఆధారాలు తెలుపుతున్నాయి. ఈ మండపం యొక్క ప్రత్యేకత ఏమిటంటే పెనుకొండ మండలంలో ఏవైతే పురాతన దేవాలయాలు ఉన్నాయో ఆ దేవాలయాల్లో ఉన్న మూల విగ్రహాలుకు సంబంధించిన చిత్రాలు ఈ యొక్క మండపాల పైన ఉన్నాయి. అంతే కాకుండా ఆలయం మధ్యలో యజ్ఞమండపం కూడా నేటికి ఉన్నది, అది కూడా శిథిలావస్థకు చేరుకుంటుంది ఇటువంటి చరిత్ర గలిగిన ఈ ఆలయాన్ని తిరిగి పునర్ నిర్మించాలని స్థానిక ప్రజలు నిర్ణయం తీసుకొని కనిగిరి హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేయాలని సంకల్పించారు.ఆ వైభవాన్ని తీసుకొని వచ్చి ఆ మహానుభావుని యొక్క జ్ఞాపికలను పెనుకొండ ప్రజలకు అందించాలని ఉద్దేశంతో ఈ మండపాన్ని శ్రీ మహాలక్ష్మి ఆలయంగా తీర్చిదిద్దాలని అభివృద్ధి చేయాలని ప్రజలందరూ సంకల్పించడం జరిగింది. ఐతే ఈకట్టడం మండపం ఆర్కియాలజీ డిపార్ట్మెంట్, దేవాదాయశాఖ అధీనంలో గానీ లేవు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మంత్రి సవిత,ఎంపీ బీ.కే పార్థసారథి లు సహాయ సహకారాలు అందించాలని,అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలని స్థానిక ప్రజలందరూ కోరుతున్నారు.

# ఫోన్ ఇన్ ప్రోగ్రామ్‌కు విశేష స్పందన

- ఎస్ఐఆర్‌పై సందేహాలను నివృత్తి చేసిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనకి చేస్తున్న జిల్లా కలెక్టర్

**శ్రీ సత్యసాయి జిల్లా, జూలై 11, ప్రభాతవార్త ప్రతినిధి**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఓటర్లలో ఉన్న పలు అపోహలు, సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శనివారం కలెక్టరేట్లో నిర్వహించిన ఫోన్ఇన్ కార్యక్రమంకు జిల్లా వ్యాప్తంగా ఓటర్ల నుండి విశేష స్పందన లభించింది. శనివారం ఉదయం 10:30 నుండి 11:30 గంటల వరకు జరిగిన ఈ లైవ్ కార్యక్రమంలో ఓటర్లు ఫోన్ ద్వారా అడిగిన పలు సాంకేతిక, సాధారణ ప్రశ్నలకు కలెక్టర్ సున్నితంగా, వివరంగా సమాధానాలు ఇచ్చారు. ఎన్యూమరేషన్ పత్రాల్లో వివరాలు నమోదు చేసి తిరిగి అందించడంలో తలెత్తుతున్న ఇబ్బందులు, ఫారాలను ఎలా నింపాలి? ఏ వివరాలు అందించాలనీ అడుగగా, కలెక్టర్ వివరణ ఇస్తూఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసే విధానాన్ని, అందులో పొందుపరచాల్సిన స్పష్టమైన వివరాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. అలాగే 2002 ఓటర్ల జాబితాలోని వివరాలు ఎలా పొందాలి? అందులో పేరు లేకపోతే ఏం చేయాలనీ ప్రశ్నించగా, పాత ఓటర్ల జాబితా రికార్డుల పరిశీలన, పేరు లేని పక్షంలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు అనుసరించాల్సిన మార్గాలను సూచించారు.బూత్ లెవెల్ అధికారులను ఎలా సంప్రదించాలనీ అడుగగా, స్థానిక ఓటర్లు తమ పరిధిలోని బి ఎల్ ఓలను సులభంగా సంప్రదించేందుకు అందుబాటులో ఉన్న వ్యవస్థలను తెలియజేశారు. ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చిన వారి పరిస్థితి ఏంటి వేరే రాష్ట్రం నుండి పెళ్లి చేసుకుని ఇక్కడికి వచ్చిన మహిళలు ఓటు హక్కు కోసం ఏం చేయాలనీ అడుగగా, వివాహమై కొత్తగా వచ్చిన మహిళలు ఇతర ప్రాంతాల నుండి శాశ్వతంగా ఇక్కడికి మారిన వారు అవసరమైన నివాస ధృవీకరణ పత్రాలతో ఓటు బదిలీ (ఫారం 8 ద్వారా) లేదా కొత్త నమోదు ఎలా చేసుకోవాలో స్పష్టత ఇచ్చారు. "ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే జిల్లా యంత్రాంగం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఓటర్లు ఎలాంటి అపోహాలు పెట్టుకోకుండా, తమకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకుని ఓటర్ల జాబితాలో పేర్లను సరిచూసుకోవాలన్నారు. సచివాలయాల్లో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ శనివారం పుట్టపర్తి కేంద్రంలోని 6, 7వ వార్డు సచివాలయాలను, అలాగే యెనుమలపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే పురోగతిని క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించేందుకు ఆయన ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయాల్లోని వివిధ విభాగాలను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే రికార్డులను, ఎన్యూమరేషన్ ఫారాలను, ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను ఆయన స్వయంగా తనిఖీ చేసి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, ఎలాంటి తప్పులు లేకుండా సాగాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్ఓలు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది అంతా విధిగా కార్యాలయాల్లో ఉంటూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ సేవలను సకాలంలో అందిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని స్పష్టం చేశారు. సచివాలయాల పనితీరుపై, సర్వేల పురోగతిపై నిరంతరం నిఘా ఉంటుందని, విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, సచివాలయాల ఈఓలు, బీఎల్ఓలు, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఫోన్ ద్వారా ఓటర్ల సందేహాలు నివృత్తి చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

# సీఎం సర్ నన్ను కాపాడండి

- తనపై 27 కేసులున్నాయని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన
- అనంతలో టీడీపీ కార్యకర్త కన్నీటి ఆవేదన



పార్టీ జెండా చేతబూని నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి కార్యకర్త రఫీ

**అనంతపురం క్రైమ్ జూలై 11 ప్రభాతవార్త**

సీఎం చంద్రబాబు నాయుడు సార్, మంత్రి లోకేష్ సార్, నన్ను కాపాడండి.. 2019 నుండి 2024 వరకు నాపై 27 కేసులు నమోదయ్యాయి. ఈ ఐదేళ్లలో నేను జైలు జీవితాన్ని అనుభవించాను. నా భార్య బిడ్డలు కూడా నన్ను చీదరించుకుంటున్నారు. నా జీవితం నాశనమైపోయిందంటూ అనంతపురం నగరంలోని టిడిపి కార్యకర్త రఫీ ఆక్రందన చేశాడు. నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయం ప్రధాన ద్వారంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద శనివారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశాడు. అక్కడే వున్న టీడీపీ జెండా చేతబూని తనకు న్యాయం చేయాలంటూ కన్నీటి పర్యంతం అయ్యాడు. 27 కేసుల్లో జైలు జీవితం అనుభవించి భార్య బిడ్డలకు దూరమయ్యాయనంటూ ఎన్టీఆర్ విగ్రహం ముందు తన నిరసన గళాన్ని విప్పాడు. నా ప్రాణం పోయినా ఇక్కడి నుండి కదలనని ఆవేదన చెందాడు. 1982 టీడీపీ ఆవిర్భావం నుండి మా కుటుంబం టీడీపిలో వుంటూ పార్టీ అభివృద్ధికి పనిచేశామని వాపోయాడు. ఇక్కడ టీడీపి పార్టీకి అన్యాయం జరుగుతోందని వాపోయాడు. తమ గురించి ఏ ఒక్క నాయకుడు పట్టించుకోలేదని వాపోయాడు. ఈ విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు ఇతన్ని అక్కడ నుండి స్టేషనుకు తరలించారు.

# జిల్లాలో అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి

# కొత్తచెరువు సచివాలయంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

# డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

4 >>

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ...ఓటర్ల జాబితాలో ఉండాలి

# నేడు సిపిఐ నేత వెంగమ నాయుడు వర్ధంతి

## జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట అన్నదానం



సిపిఐ నేత వెంగమ నాయుడు (ఫైల్‌ఫోటో)

**అనంతపురం, జూలై 11, (ప్రభాతవార్త బ్యూరో)**

అనంతపురం జిల్లా లో వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమ నేత , సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు కామ్రేడ్ పి వెంగమ నాయుడు 29 వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరగనుంది.వెంగమ నాయుడు పార్టీ తరఫున చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆదివారం ఉదయం పదిగంటలకు అనంతపురం సిపిఐ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దివంగత సిపిఐ నేత వెంగమ నాయుడు జీవిత విశేషాలను గుర్తు చేసుకుందాం.పెద్ద పప్పూరు మండలం చీములవాగుపల్లి గ్రామం లో హనుమంతు.బాలమ్మ అను దంపతులకు 1926 సంవత్సరం ఆగస్టు 26వ తేదీన జన్మించారు. 1950 లో కమ్యూనిస్టు పార్టీలో చేరిన వెంగమ నాయుడు పార్టీ కార్యక్రమాలు రహస్యంగా ప్రారంభించారు. అ రోజుల్లో జిల్లాలోని గ్రామీణ ప్రాంత లలో ఉన్నా వ్యవసాయ కూలీలను సమీకరించి చీమల వాగు పల్లెలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రథమ మహాసభకు ఏర్పాట్లు చేశారు. ఈ మహాసభకు కమ్యూనిస్టు పార్టీ కురువృద్ధులు , స్వాతంత్ర సమరయోధులు వికె ఆదినారాయణ రెడ్డి, ఇతర కొంతమంది కమ్యూనిస్టు పార్టీ ముఖ్యులు హాజరైనారు. అప్పట్లో పోలీసులు మహాసభ పై దాడి చేసి కాల్పులుకూడా జరిపారు.సిపిఐనేత వెంగమ నాయుడుతోపాటు కొంతమంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు పోలీసులు కలుగప్పి తప్పించుకున్నారు. 1952 సంవత్సరంలో పార్టీపై నిషేధం తొలగించిన తర్వాత తాడిపత్రి తాలూకాలో సిపిఐ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తదుపరి జిల్లా పార్టీలో చురుకుగా పని చేసి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. భూ పోరాటాలను భూస్వాములను, పెత్తందార్లకు వ్యతిరేకంగా వ్యవసాయ కూలీలకు కూలీ రేట్లుపెంచాలి అని డిమాండ్ చేస్తూ తరిమెల, పాముదుర్తి,దొరిగిల్లు, ఇల్లూరు ,తదితర గ్రామాలలో వ్యవసాయ కూలీలను సమీకరించి పోరాటాలు నిర్వహించి వ్యవసాయ కూలీలకు కూలిరేట్లు పెరగడానికి కార్మికులతో కూలి పోరాటాలు నిర్వహించారు. 1960 దశకంలో భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవసాయ కార్మిక సంఘం ఇచ్చిన పిలుపుమేరకు. కళ్యాణదుర్గం. అనంతపురం తాలుకలోని తదితర గ్రామాలలో బంజరు భూములు, అసైన్డ్ భూములు,సీలింగ్ భూములు, దేవాలయములు పోరాటలు నిర్వహించి భూములు లేని నిరుపేదలకు పంచారు. ఆ సందర్భముగా ప్రభుత్వం పెట్టిన కేసులకు దాదాపు మూడు నెలల పాటు గుత్తి సబ్ జైల్లో శిక్ష అనుభవించారు. కమ్యూనిస్టు పార్టీ తో సంబంధం ఏర్పడ్డాక ఆ పార్టీలో చేరాక ప్రజా సమస్యల పైన పనిచేశారు. చీములవాగు పల్లెలో పేద ప్రజల కోసం కోఆపరేటివ్ సొసైటీ ని స్థాపించి దానిద్వారా వ్యవసాయ కార్మికులకు రైతులకు అప్పులు ఇప్పించి దాదాపు 15 సంవత్సరాలు సొసైటీ సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలో ఉత్తమసొసైటీగా తీర్చిదిద్దారు. 1972 సంవత్సరంలో అనంతపురం జిల్లా కార్యదర్శిగా ఎంపికై ఆ బాధ్యతలలో 1992 సంవత్సరం వరకు నిర్విఘ్నంగా కొనసాగారు. ఆయన జిల్లా కార్యదర్శిగా ఉన్న కాలంలోనే కౌకుంట్ల భూ పోరాటం జరిపిన ఫలితంగా భూస్వామి పయ్యావుల వెంకటనారాయణ భూములను అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు , అప్పటి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి నల్లమల గిరిప్రసాద్ కూడ స్వయంగా వచ్చి భూ సమారాధనపేరుతో పంపిణీ చేశారు. ఈ భూ పోరాటం చరిత్రలో లిఖించదగినది. యాడికి కాలవ. పిన్నేపల్లి చెరువు నీటి కోసం రైతులను ప్రజలను సమీకరించి పోరాడారు 1977 జరిగిన ఒక పోరాటం సందర్భంగా ఆయన పై ప్రత్యర్థులు తుపాకి కాల్పులు జరిపారు. 1991లో జిల్లా ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటంలో అయన తాడిపత్రి ప్రాంతంలో వీరోచితంగా పాల్గొన్నారు. మూతపడిన గుంతకల్ స్పిన్నింగ్ మిల్లు తెరిపించడానికి అనే ఆందోళన పోరాటాలు నిర్వహించారు. వెంగమ నాయుడు చేసిన పోరాటాలలో నష్టపోయిన భూస్వాములు , పెట్టుబడిదారులు ఆయన పైన కక్షకట్టారు. 1997లో జులై 12 తేదీన అనంతపురంలోని పార్టీ ఆఫీస్ నుండి ఇంటికి పోయే మార్గంలోరాజు రోడ్డులో ఉన్న హోటల్ వద్ద కాపు కాచి కిరాయి గుండాలు పట్టపగలు వెంగమ నాయుడుని హత్య చేశారు. వెంగమ నాయుడు జీవితకాలంలో ప్రజా సమస్యలపై పట్టుదలతో పనిచేసి ప్రజల కోసం జీవించిన మనిషిగా గుర్తింపు తెచ్చుకొని నేటి వామపక్ష కార్యకర్తలు, నాయకులకు ఆదర్శంగా నిలిచారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సితో ఎవరు భయపడాల్సిన అవసరం లేదు

- మానవ మేధస్సుకు మించింది లేదు - స్కిల్ ఉన్నవాళ్లు ఎక్కడైనా రాణిస్తారు
- శ్రీ బాలాజీ విద్యాసంస్థల అధినేత పల్లె వెంకటకృష్ణ కిషోర్



పల్లె వెంకటకృష్ణ కిషోర్

**అనంతపురం, జూలై 11, (ప్రభాతవార్త బ్యూరో)**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ వల్ల విద్యార్థులు, సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు, ఇతరులు ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, మానవ మేధస్సుకు అన్ని దిగదిడుపు అని ప్రముఖ శ్రీ బాలాజీ విద్యా సంస్థల అధినేత పల్లె వెంకటకృష్ణ కిషోర్ అభిప్రాయపడ్డారు. ఏ కోర్సు వచ్చినా మానవ మేధస్సుకు రీప్లేస్ చేయలేదని ఆయన స్పష్టంచేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ తో ఉద్యోగాలు సన్నగిల్లుతాయి, ఉన్న ఉద్యోగాలు పోతాయని చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రభాతవార్త ప్రతినిధి అడిగిన మేరకు ఆయన ఈవిధంగా వివరణ ఇచ్చారు. ఏ రంగంలోనైనా మార్పులు రావడం సహజం అని, మార్పులు వచ్చినప్పుడు దానిని స్వాగతించాలని, ఆ సమయంలో మన మేదస్సుతో సమయస్ఫూర్తితో ముందుకు సాగి సక్సెస్ కావచ్చు అన్నారు.. ఈత రానంతవరకు ఎలా ఇదాలని భయపడతామని, ఈత నేర్చుకుంటే ఆ భయం ఆమడ దూరం పరిగెడుతుందన్నారు. కొన్నేళ్లుగా వివిధ రంగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది ఈ పరిస్థితుల్లో కూడా మనం భయపడలేదు కదా దేనికైనా మానవ మేధస్సు అవసరం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ వచ్చినా మానవ మేధస్సు సహకారం ఎంతో అవసరం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో కొన్ని ఇబ్బందులు రావొచ్చని, విద్యార్థులు, సాఫ్ట్వేర్ ఉద్యోగులు మరీ భయపడాల్సిన అవసరం లేదని పల్లె వెంకటకృష్ణ కిషోర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం మెకానికల్ ఇంజనీరింగ్ లో మెకాట్రానిక్స్, రోబోటిక్స్ ఇలాంటి కొత్త కోర్సులకు విద్యార్థుల నుంచి డిమాండ్ ఉంది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిస్థితులు, ఆర్థిక సంక్షోభం, అమెరికా చర్యలు , బయట దేశాలకు ఎగుమతులు తగ్గడం తదితర కారణాలవల్ల ఇంజనీరింగ్ లో కంప్యూటర్ సైన్స్ కు దాదాపు ఐదు శాతం డిమాండ్ తగ్గిందన్నారు. కోర్ ఇంజనీరింగ్ కోర్సులు వైపు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారన్నారు.. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో జాబ్ మార్కెట్లో ఉన్న అనిచ్చితి ప్రభావం వల్ల కోర్ ఇంజనీరింగ్ కోర్స్ లు అయినా సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఈఈఈ లాంటి కోర్సులు విద్యార్థులు తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు అన్నారు. మార్కెట్లోకి కొత్త యంత్రాలు గాని, ఇతర ఏదైనా వచ్చినప్పుడు కొన్ని ఇబ్బందులు సహజమేనని, విద్యార్థుల్లో, ఉద్యోగుల్లో స్కిల్ ఉంటే ఎప్పుడు భయపడాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. విద్యార్థులు ఏ కోర్సులు ఆసక్తితో ముందుకు వస్తే విద్యార్థుల ఆలోచనలు తగ్గట్టు ఆయా కోర్సుల్లో చేర్చేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు రావాలని, విద్యార్థుల ఆలోచనలకు భిన్నంగా ఫలాన కోర్సు తీసుకోవాలని ఒత్తిడి తేవద్దని పల్లె వెంకటకృష్ణ కిషోర్ విజ్ఞప్తి చేశారు.

# వియత్నం బోటు ప్రమాదంలో పురం యువకుడు దుర్మరణం



రవితేజ మృతదేహం

**హిందూపురం జూలై 11 ప్రభాతవార్త**

వియత్నం దేశంలో విహారయాత్రకు వెళ్లిన శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందిన రవితేజ (40) దుర్మరణం చెందారు. స్థానిక టీచర్స్ కాలనీలో నివసిస్తున్న రవితేజ ధనలక్ష్మి రోడ్లో లక్కీ మొబైల్ షాపును నిర్వహించేవారు. లావా కంపెనీ ఫోన్లను అధికంగా సేల్ చేయడంతో విహారయాత్రకు సెలెక్ట్ అయి కంపెనీ తరఫున వియత్నానికి మూడు రోజుల క్రితం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం సుమారు 11:30 గంటల ప్రాంతంలో వియత్నం దేశంలో సముద్రంలో స్పీడ్ బోట్ లో వెళ్తుండగా ఒకసారిగా అలల తాకిడి పెరిగి బోటు బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో రవి తేజతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు మృత్యువాత పడ్డారు. ఇదిలా ఉండగా రవితేజ మరణ వార్త తెలుసుకొని కుటుంబ సభ్యులు షాక్ గురయ్యారు. తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు శోక సంద్రంలో పడిపోయారు. రవితేజ తండ్రి ఆదిశేషయ్య చాలా ఏళ్ల క్రితమే చనిపోగా ఆ కుటుంబానికి ఏకైక కుమారుడైన ఇతను కూడా మరణించడంతో మగదిక్కు లేకుండా పోయిందని ఆత్మీయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అందరితో మంచివాడిగా పేరొందిన రవితేజ అకాల మరణం చెందడంతో స్నేహితులు, పుర ప్రజలు చలించి పోయారు. వియత్నం నుంచి మృతదేహాన్ని వీలైనంత తొందరగా రప్పించేందుకు భారత ఎంబసీ ద్వారా బంధువులు ప్రయత్నాలు చేస్తున్నారు. వరుసకు అన్న అయిన భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన తమ్ముడు మృతి జీర్ణించుకోలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు.



రవితేజ (ఫైల్ ఫోటో)

## రాష్ట్రంలో విద్వేష రాజకీయాలు మానుకోవాలి

- జనసేన కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జి బాల్యం రాజేష్



విలేకరుల సమావేశంలో జనసేన కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జి బాల్యం రాజేష్

**కళ్యాణదుర్గం, జూలై 11 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌లో కుల, మత, ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలు రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని జనసేన పార్టీ కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జి బాల్యం రాజేష్ విమర్శించారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కొందరు వ్యక్తులు వైసీపీ ముసుగులో కుల, మత విభేదాలను సృష్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను, కూటమి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. జడ శ్రవణ్, ప్రశ్న రావణ్ వంటి వ్యక్తులు తాడేపల్లి ప్యాలెస్ నుంచి ప్రోత్సాహం పొందుతున్నారని, వీరిని వైసీపీ ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. గతంలో కుల, మత రాజకీయాల కారణంగా ఆంధ్రప్రదేశ్ ఎన్నో సంవత్సరాలు వెనుకబడిందని పేర్కొన్న బాల్యం రాజేష్, అదే పరిస్థితి మళ్లీ రాకుండా రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలకు బదులుగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నిర్మాణాత్మక చర్చలకు రావాలని సవాల్ విసిరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిజాయితీ, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధత ప్రజలకు తెలుసని, కూటమి ప్రభుత్వ లక్ష్యం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమేనని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమని చెప్పారు. విద్వేషాలు, విభేదాలను రెచ్చగొట్టే రాజకీయాలకు స్వస్తి చెప్పాలని, లేకపోతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు గాజులపల్లి రమేష్, చెర్లోపల్లి రామలింగ, జాకీర్ హుస్సేన్, అనిల్ పాళ్యం, చిన్నంపల్లి సుమన్, జంబగుంపల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సర్వేను పరిశీలించిన తలారి రంగయ్య



ఓటరు జాబితా సర్వేను పరిశీలిస్తున్న సమన్వయకర్త తలారి రంగయ్య

**కళ్యాణదుర్గం, జూలై 11 ప్రభాతవార్త**

పట్టణంలోని 9వ సచివాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని మాజీ ఎంపీ, వైఎస్సార్సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన సర్వే పురోగతి, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణలు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా అవగాహన ర్యాలీ



ఆరోగ్యమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం


**పుట్టపర్తి (వైద్యం) జూలై 11 ప్రభాతవార్త**

శ్రీ సత్యసాయి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ, మాతా, శిశు ఆరోగ్యం, మహిళల సాధికారత, బాలికల విద్య, బాధ్యతాయుతమైన తల్లిదండ్రత్వం, సమతుల్య జనాభా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం ఘనంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్. ఫైరోజా బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీ ఎ. శ్యామ్ ప్రసాద్, ఐ.ఏ.ఎస్. ముఖ్య అతిథిగా హాజరై, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం డి ఎం హెచ్ ఓ ఆఫీస్ నుండి వై జంక్షన్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి ్పిల్లలమధ్యసరైనఎడం ఆరోగ్యకరమైన, ఆనందకరమైన కుటుంబానికి ఆధారం. పిల్లల మధ్య ఎడంపాటిద్దాం ఆరోగ్యవంతమైన, సంతోష కరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం ప్రజలలో కి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తీసుకువెళ్లాలని ఆరోగ్యకరమైన కుటుంబ జీవితాన్ని నిర్మించుకోవాలని సూచించారు ఈ సవందర్భంగా తెలియజేశారు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్. ఫైరోజా బేగం మాట్లాడుతూ, ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కుటుంబ నియంత్రణ, జననాల మధ్య సరైన విరామం, మాతా, శిశు సంక్షేమం, మహిళల ఆరోగ్యం, బాలికల విద్య, లింగ సమానత్వం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న కుటుంబ నియంత్రణ సేవలను ప్రతి అర్హులైన దంపతులు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యకరమైన కుటుంబ జీవితాన్ని నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్ కుమార్ ఎన్‌సీడీ, సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్, కె. కళాధర్ స్టాటిస్టికల్ ఆఫీసర్, శ్రీమతి వీరమ్మ డిపిహెచ్ఎన్ఓ, సుబ్రహ్మణ్యం డిప్యూటీ డెమో, పి. నాగరాజు జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్‌హెచ్ఎం, డాక్టర్ సుమదుర వైద్యాధికారి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏనుమలపల్లి, డాక్టర్ గాయత్రి వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పుట్టపర్తి, శివరామ్ సీహెచ్ఓ, రామమోహన్, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

### జవహర్ నవోదయ ఆరవ తరగతి ప్రవేశం కొరకు

- జూలై 31 లోపు దరఖాస్తు చేసుకోండి - డీఈవో జీ కృష్ణప్ప
- నవంబర్ 28, 2026 ప్రవేశ పరీక్ష నిర్వహణ



డీఈవో జీ కృష్ణప్ప

శ్రీ సత్య సాయి జిల్లా జవహర్ నవోదయ విద్యాలయాల్లో (JNVs) 2027-28 విద్యాసంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాలకు సంబంధించి జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ (JNVST) నోటిఫికేషన్ విడుదల కావడం జరిగిందని డీఈవో జీ కృష్ణప్ప ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనది. 2026 నవంబర్ 28వ తేదీ నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించబడును జులై 31 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. 2026-27 విద్యా సంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునీ తెలిపారు దరఖాస్తులు అధికారిక వెబ్‌సైట్ www.https://cbseitnsnic.in/nvs ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలి. మరింత సమాచారం కోసం జవహర్ నవోదయ విద్యాలయము, ప్రిన్సిపాల్ లేపాక్షి, నీ సంప్రదించండి.

## మహిళల సాధికారితయే సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం

రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రీజనల్ అధికారి ఆరిఫ్ ఉల్లా



**అమరాపురం జూలై 11 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు సామాజిక ఆర్థిక అభివృద్ధితో పాటు మహిళా సాధికారిక పై అవగాహన కార్యక్రమాన్ని సిరా రోడ్డు ఇందిరమ్మ కాలనీలో ఉన్న బ్రాంచ్ కార్యాలయం నందు డివిజనల్ మేనేజర్ శ్రీనివాస్ బాబు, ప్రాదేశిక వ్యవస్థాపకులు గౌస్ పీర్ ల అధ్యక్షతన శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రీజనల్ అధికారి ఆరిఫ్ ఉల్లా, అమరాపురం ఎస్సై వలి భాష, ఉపాధ్యాయుడు యంజారప్ప, సీనియర్ పాత్రికేయుడు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు. క్రెడిట్ యాక్సి స్ గ్రామీణ్ శాఖ మేనేజర్ నాగేష్, కంపెనీ బి ఎస్ టి మహేంద్ర, ఏరియామేనేజర్ చంద్రశేఖర్, గంగాధర్ స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ మహిళల సాధికారిక మరియు సమానత్వం పెంపొందించడానికి క్రెడిట్ ఆసిస్ గ్రామీణ శాఖ మారుమూల గ్రామాల్లో ఎలాంటి మౌలిక వసతులు లేని మరియు జీవనోపాదులకు కష్టమై ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకొని పురుషులకు సమానంగా మహిళలు ఎదగాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించినప్పుడే దేశం ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తుందని ప్రతి మహిళ ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అన్ని రంగాల్లో రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా మా సంస్థ యందు ఇన్సూరెన్స్ మరియు ఉన్నత విద్య తదితర రంగాల్లో మహిళల కుటుంబాలకు ప్రయోజనంచేకూర్చాలనే లక్ష్యంతో ఏలాంటి షరత్తు లేకుండా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తీసుకున్న రుణాన్ని సక్రమంగా చెల్లించి అభివృద్ధి సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సై వలిభాష మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. లైంగిక వేధింపులు, గృహనిర్బంధం చిన్న పిల్లలపై అఘాయిత్యం తదితర అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపడానికి అనేక కొత్త చట్టాలు అమల్లో ఉన్నాయని వీటిపై మహిళలకు అవగాహన అవసరమన్నారు. మైనర్ బాలికలను వేధిస్తే పోక్స చట్టం కింద కేసు నమోదు చేస్తామన్నారు. ఉపాధ్యాయుడు యంజారప్ప మాట్లాడుతూ ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి మహిళలు కృషి చేయాలన్నారు. చిన్న పనులు చేసుకుంటూ నేడు దేశానికి సంపన్నులుగా ఉన్నటువంటి పరిస్థితులను ఆయన వివరించారు. ముఖ్యంగా అభివృద్ధి సాధించాలంటే క్రమశిక్షణ చాలా అవసరం అన్నారు. అనంతరం రుణ సౌకర్యాల గురించి మరియు ఫేక్ సమాచారం పట్ల ప్రత్యేక వీడియో ద్వారా మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అమరాపురం గుడిబండ మండలాల నుంచి అనేక మంది మహిళలు విచ్చేసి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రపంచ జనాభా దినోత్సవం.. ధర్మవరంలో అవగాహన ర్యాలీ

కుటుంబ నియంత్రణ పాటిద్దాం..
నూతన అధ్యాయానికి నాంది పలుకుదాం
కుటుంబ నియంత్రణపై ప్రజల్లో చైతన్యం కల్పిద్దాం
: డా. తిప్పేంద్ర నాయక్
కుటుంబ నియంత్రణతో నూతన అధ్యాయానికి శ్రీకారం



ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కుటుంబ నియంత్రణ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. తిప్పేంద్ర నాయక్, వైద్యులు, వైద్య సిబ్బంది

**ధర్మవరం టౌన్, జూలై 11 ప్రభాతవార్త**

కుటుంబ నియంత్రణ పాటిద్దాం... నూతన అధ్యాయానికి నాంది పలుకుదాం అని ధర్మవరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. తిప్పేంద్ర నాయక్ పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ధర్మవరం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలో ర్యాలీని డా. తిప్పేంద్ర నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్న కుటుంబం సుఖసంతోషాలకు, తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణకు కుటుంబ నియంత్రణ ఎంతో అవసరమని తెలిపారు. ప్రజలందరూ కుటుంబ నియంత్రణ పద్ధతులను అవలంబించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కుటుంబ నియంత్రణ పాటిద్దాం... నూతన అధ్యాయానికి నాంది పలుకుదాం అంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దర్శినమల వైద్యాధికారి డా. పుష్పలత, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డా. సురేశ్ నాయక్, వైద్యులు డా. శ్రావణి, డా. శ్వేత, డా. ప్రియాంక, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరాంనాయక్, జయంత్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు అన్న లక్ష్మీనారాయణ, మారుతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్నేహబంధం చిరస్థాయిగా.. మిత్రుడి కుమార్తె చదువుకు భరోసా

1996-97 ఎస్సీసీఎస్ రైల్వే స్కూల్ 10వ తరగతి బ్యాచ్ మిత్రుల గొప్ప నిర్ణయం

హానీ దీక్షిత ఉన్నత విద్య కోసం కెనరా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్

రూ.1.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్‌తో ఆదర్శంగా నిలిచిన 1996-97 బ్యాచ్ మిత్రులు



చిరంజీవి కుమార్తె హానీ దీక్షిత ఉన్నత విద్య కోసం రూ.1.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేసిన 1996-97 ఎస్సీఎస్ రైల్వే స్కూల్ బ్యాచ్ మిత్రులు

కష్టకాలంలో అండగా నిలిచిన ఆప్తమిత్రులు..
నిజమైన స్నేహానికి నిలువెత్తు నిదర్శనం
హానీ దీక్షిత ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించిన సహాధ్యాయులు

**ధర్మవరం టౌన్, జూలై 11 ప్రభాతవార్త**

నిజమైన స్నేహం అంటే కష్టకాలంలో అండగా నిలవడమేనని మరోసారి నిరూపిస్తూ, 1996-97 విద్యా సంవత్సరానికి చెందిన ఎస్సీసీఎస్ రైల్వే స్కూల్ పదో తరగతి బ్యాచ్ మిత్రులు తమ సహాధ్యాయి చిరంజీవి కుటుంబానికి ఆర్థిక చేయూత అందించారు. ప్రస్తుతం డయాలసిస్ చికిత్స పొందుతున్న చిరంజీవి కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఆయన కుమార్తె హానీ దీక్షిత ఉన్నత విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా రూ.1.50 లక్షలను కెనరా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా జమ చేశారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ.. చిరంజీవి ఆరోగ్య సమస్యల కారణంగా కుటుంబంపై ఆర్థిక భారం పెరిగిందని, అలాంటి సమయంలో ఆయన కుమార్తె విద్యాభవిష్యత్తు భద్రంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. స్నేహబంధానికి ఇది చిరస్మరణీయ ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వెంకటప్ప మాట్లాడుతూ.. హానీ దీక్షిత ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మిత్రులు చేసిన ఈ సహాయం ఆదర్శప్రాయమని, కష్టసమయంలో తోడుగా నిలిచే వారే నిజమైన స్నేహితులని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో చేనేత ప్రముఖులు, టీడీపీ యువ నాయకుడు సంధా రాఘవ, జింకా పురుషోత్తం, లోకనాథ్, జయరాములు, హరి, పరంధామ, నాగవేణి, గోవిందమ్మ, గాయత్రి, ఫక్రున్నీసా తదితరులు పాల్గొని మిత్రుల సేవాభావాన్ని అభినందించారు.

## విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించండి

కేజీబీవీ ప్రాజెక్టు అడిషనల్ కోఆర్డినేటర్



కేజీబీవీలో విద్యార్థులతో చర్చిస్తున్న ప్రాజెక్టు అడిషనల్ కోఆర్డినేటర్

**బత్తలపల్లి, జూలై 11 ప్రభాతవార్త**

కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినిలకు నాణ్యమైన విద్యాబోధన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని శ్రీసత్యసాయి జిల్లా కేజీబీవీ ప్రాజెక్టు అడిషనల్ కోఆర్డినేటర్ వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని సంజీవపురం వద్ద గల కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయాన్ని కేజీబీవీ ప్రాజెక్ట్ అడిషనల్ కోఆర్డినేటర్ వెంకటేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోకి వచ్చి రాగానే పరిసరాలను పరిశీలించి వంట గదులను తనిఖీ చేశారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు విద్యాపథం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకం కింద ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, షూస్, యూనిఫామ్ తదితర విద్యాసామగ్రిని సకాలంలో పంపిణీ చేశారా లేదా ఆరా తీశారు. ముఖ్యంగా పదవ తరగతి, ఇంటర్ విద్యార్థిను లకు నిర్వహించిన స్లిప్ టెస్ట్ లు, గ్రాండ్ టెస్ట్ లు గురించి ఆరా తీశారు. పరీక్షలలో విద్యార్థినిలకు మార్కులు ఏ విధంగా వచ్చాయో తెలుసుకున్నారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థినిలకు పుస్తకాలు సకాలంలో పంపిణీ చేశారా, సిలబస్ ప్రారంభించారా, ప్రిన్సిపాల్ తో పాటు టీచింగ్ స్టాఫ్, నాన్





విద్యార్థినిలకు వడ్డించే భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ప్రాజెక్టు అడిషనల్ కోఆర్డినేటర్

టీచింగ్ స్టాఫ్ తదితరులు సకాలంలో విధులకు హాజరవుతున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలకు శానిటరీ కిట్స్ అందుబాటులో ఉన్నాయా, ముఖ్యంగా స్నానపు గదులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాల ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలకు అందుబాటులో ఏర్పాటుచేసిన వ్యక్తిగత పిల్లల అభ్యాసన మదింపు ప్రక్రియ ల్యాబ్, సాంకేతిక ల్యాబ్, ఐటీ ల్యాబ్ ను పరిశీలించి పనితీరును డ్యూటీ టీచర్లతో అడిగి తెలుసుకున్నారు.

## త్వరలో హిందూపురం బ్రాహ్మణ సంఘం కొత్త కమిటీ



ప్రసంగిస్తున్న కల్లూరు ఆదినారాయణరావు

ఆగస్టు 9న జనరల్ బాడీ మీటింగ్


**హిందూపురం టౌన్ జులై 11 ప్రభాతవార్త**

పట్టణంలో శ్రీ గాయత్రి దేవస్థానం నందు హిందూపురం తాలూకా బ్రాహ్మణ సంఘం అత్యవసర సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశం నందు హిందూపురం తాలూకా బ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకొనే విషయం పై విస్తృతంగా చర్చించారు. చాలా ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న బ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ని సమిష్టి నిర్ణయంతో ఎన్నుకోవడం జరుగుతుందని సంఘం నాయకులు స్పష్టం చేశారు. బ్రాహ్మణ పెద్దల సూచనలు సలహాల మెరకు హిందూపురం పట్టణం, చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం రూరల్, పరిగి మండలాలలో వున్న ప్రతి బ్రాహ్మణ కుటుంబాన్ని కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. ఆగష్టు 9న జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమం లో కొట్నూర్ ఆదినారాయణ రావు, కల్లూరు ఆదినారాయణ రావు, కొటిపి నాగేశ్వరావు, పరిగి లక్ష్మణ రావు, చిలమత్తూరు మండలం అధ్యక్షులు ప్రకాశరావు, పరిగి మండల అధ్యక్షులు శ్రీనివాసరావు మొదలగు వారు పాల్గొన్నారు.

## ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీ

**శెట్టూరు జులై 11 ప్రభాతవార్త**

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ నికిత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ, తల్లిశిశు ఆరోగ్యం, విద్య మరియు ఆరోగ్య సేవల ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగగా ప్రజలు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం డాక్టర్ నికిత మాట్లాడుతూ, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆరోగ్యం, విద్య, సహజ వనరుల వినియోగంపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు మరియు ఇతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ర్యాలీగా వస్తున్న దృశ్యం

## పేద పిల్లలను విద్యావంతులుగా చూడాలన్నదే నా లక్ష్యం

: రిటైర్డ్ ఎస్సై రాజేంద్ర నాయక్

ఆనంద నిలయం ప్రభుత్వ వసతి గృహంలో నూతన బోరు తవ్వించగా లభ్యమైన నీరు

- మూతపడిన వసతి గృహం పునఃప్రారంభానికి చర్యలు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు సహకరించాలని రాజేంద్రనాయక్ విజ్ఞప్తి



ఆనంద నిలయం వసతి గృహం (ఇన్ సెట్ లో) రిటైర్డ్ ఎస్సై రాజేంద్ర నాయక్

**కంబదూరు, జూలై 11, ప్రభాతవార్త**

కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామంలోని ఆనంద నిలయం వసతి గృహానికి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలనే లక్ష్యంతో రిటైర్డ్ ఎస్సై రాజేంద్ర నాయక్ ముందుకొచ్చారు. తన సొంత ఖర్చులతో వసతి గృహంలో నూతన బోరు వేయించి, హాస్టల్ పునఃప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఒకప్పుడు ఈ వసతి గృహం నుంచి చదువుకున్న అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. అయితే కాలక్రమేణా తాగునీటి సమస్యతో పాటు ఇతర కారణాల వల్ల హాస్టల్ మూతపడింది. ప్రస్తుతం ఆ పరిస్థితిని మార్చి, పేద మరియు అనాథ విద్యార్థులకు మరోసారి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో రాజేంద్ర నాయక్ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేను జన్మించిన గ్రామ రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించానన్నారు. హాస్టల్‌కు పూర్వవైభవం తీసుకురావడమే నా లక్ష్యం. గతంలో ఈ వసతి గృహం నుంచి ఎందరో ప్రభుత్వ ఉద్యోగులుగా ఎదిగారు. అదే స్ఫూర్తితో మరోసారి నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన వసతి, విద్యా అవకాశాలు కల్పించి వారిని ఉన్నత స్థాయికి చేర్చేందుకు నా వంతు కృషి చేస్తాను అని తెలిపారు. వసతి గృహంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు నూతన బోరు ఏర్పాటు చేయడం తొలి అడుగని పేర్కొన్నారు. త్వరలో భవనానికి అవసరమైన మరమ్మతులు చేపట్టి, అన్ని సౌకర్యాలతో హాస్టల్‌ను తిరిగి ప్రారంభించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, ప్రభుత్వ అధికారులు సహకరించి ఆనంద నిలయం వసతి గృహం పునఃప్రారంభానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఎస్సై రాజేంద్ర నాయక్ విజ్ఞప్తి చేశారు. రాజేంద్ర నాయక్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు, స్థానికులు, పూర్వ విద్యార్థులు అభినందించారు. ఆనంద నిలయం తిరిగి ప్రారంభమైతే ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తుకు బాటలు వేస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



బోరు త్రవించగా నీరు లభ్యమైన దృశ్యం

## వైభవంగా కనకప్ప మారమ్మ దేవతల విశేష పూజలు



విశేష పూజల దృశ్యం

**అమరాపురం జులై 11 ప్రభాతవార్త**

మండల పరిధిలోని అలదపల్లి పంచాయతీ కనకనపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కనకప్పస్వామి, మారమ్మ దేవతల విశేష పూజ కార్యక్రమాలను కనకనపల్లి తిప్పేస్వామి, మహాలక్ష్మి దంపతులు మరియు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని వారి పొలం వద్ద దేవతల విగ్రహాలకు విశేష పూజలు మరియు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పాండురంగప్ప, చంద్రప్ప, జడ్పిటిసి పి. ఆర్ నరసింహమూర్తి, పంచాయతీ కన్వీనర్ యంజారప్ప, మాజీ ఎంపీటీసీ నరసింహప్ప, కనకనపల్లి గ్రామ పెద్దలు టిడిపి మండల క్లస్టర్ కో కన్వీనర్ మంజు తారక్, రామకృష్ణ, కేసి ఈరనాగప్ప, గౌడ ఈరనాగప్ప, ఈరనాగప్ప, చెన్నారెడ్డి, రాజప్ప, ఏ నాగేంద్ర, తిమ్మజ, యువరాజు, బుల్లెట్ రాజు, దాసప్ప, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన రాయలసీమ సాధన కోఆర్డినేటర్ హాలుకూరు కాంతరాజు

**అమరాపురం జులై 11 ప్రభాతవార్త**



సర్ కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

అమరాపురం మండలం అమరాపురం పట్టణంలోని 13,14,15, బూత్ లలో తిరుగుతున్న ఎస్ ఐ ఆర్ ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియను రాయలసీమ ఎత్తిపోతల పథకం మరియు గ్రేటర్ రాయలసీమ సాధన టాస్కోర్స్ కోఆర్డినేటర్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు హాలుకూరు కాంతరాజు శనివారం పాల్గొని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నమండల కన్వీనర్ త్రిలోకనాథ్, ఎస్ సీ సెల్ జిల్లా కార్యదర్శి నారాయణప్ప, తాలూకా ఎస్ సిసెల్ అధ్యక్షులు శివన్న, మండల బూత్ మేనేజర్ రామ్మూర్తి, మండల యువజన విభాగం అధ్యక్షులు మల్లికార్జున పబ్లిక్ సిటీ వింగ్ అధ్యక్షులు శంకర్ సీనియర్ నాయకులు జెకె నరసింహమూర్తి బిఎల్ఎ లు మాదర్ సిద్దేశ్వర, కాలనీ సిద్దేశ్వర శివ యువ నాయకుడు నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# మచ్చా దత్త రెడ్డి మెరుపు సెంచరీ

## - 15 సిక్సర్లు, 9 ఫోర్లుతో 161 పరుగులు



జట్టు గెలుపునకు కీలకంగా వ్యవహరించిన రంజీ క్రికెటర్ మచ్చ దత్తరెడ్డి

అనంతపురం, జులై 11 ప్రభాతవార్త బ్యూరో

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలో జరుగుతున్న సీనియర్స్ ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలలో శనివారం అనంతపురం జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. అనంతపురం జిల్లాకు చెందిన రంజీ క్రికెటర్ మచ్చా దత్త రెడ్డి విజయనగరంలో శనివారం జరిగిన మ్యాచ్ రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు అనంతపురం జిల్లా సీనియర్ జట్ల మధ్య పోటీ జరిగింది. పోటీల్లో సీనియర్ ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీల్లో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టుపై మెరుపు సెంచరీతో పాటు 161 పరుగులు సాధించారు. అందులో 15 సిక్సర్లు 9 ఫోర్లుతో అద్భుతంగా రాణించారు. మచ్చ దత్తారెడ్డి కేవలం 106 బాల్స్‌లో 15 సిక్సర్లతో ఏడు 9ఫోర్‌లతో అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. టాస్ గెలిచిన అనంతపురం బ్యాటింగ్ ఎంచుకుని 50 ఓవర్లలో 417 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు కేవలం 323 పరుగులు చేసి ఆరు వికెట్లు కోల్పోయింది. దీంతో అనంతపురం జిల్లా జట్టు 94 పరుగులు తేడాతో ఘన విజయం సాధించింది. అదే విధంగా సౌత్ జోన్ అనంతపురం జిల్లా సీనియర్ జట్టు చెలరేగి ఆడింది. సౌత్ జోన్ జట్టు అనంతపురం సీనియర్ జట్ల మధ్య శనివారం మ్యాచ్ ప్రారంభం కాగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జిల్లా జట్టు సౌత్ జోన్ బౌలర్ల పై విరుచుకుపడ్డారు. బ్యాట్స్ మెన్లు మచ్చ దత్తారెడ్డి అర్జున్ టెండూల్కర్ 85 పరుగులు సాధించారు. మొదటి వికెట్ పార్ట్నర్ షిప్‌కి 200 పరుగులు సాధించారు. అనంతపురం జిల్లా జట్టు 50 ఓవర్‌లో 417 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతపురం జిల్లా జట్టు బ్యాట్ మెన్‌లు మచ్చా దత్త రెడ్డి 161 పరుగులు, అర్జున్ టెండూల్కర్ 85 పరుగులు, గిరినాథ్ రెడ్డి 74 పరుగులు, హానీష్ వీరారెడ్డి 29 పరుగులు, మహేంద్ర రెడ్డి 22 పరుగులు, సాధించి అనంతపురం జిల్లా జట్టు భారీ స్కూలు చేయడంలో సక్సెస్ అయ్యారు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ బౌలర్లు మాధవ రాయుడు రెండు వికెట్లు, వాసు దేవరాజు రెండు వికెట్లు, ఆంజనేయులు ఒక వికెట్, పటాన్ షరీఫ్ ఒక వికెట్ తీసుకున్నారు. తర్వాత బ్యాటింగ్ చేసిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 50 ఓవర్లలో 323 పరుగులు మాత్రమే చేసి అనంతపురం జిల్లా జట్టు చేతిలో ఓటమిపాలయ్యింది. 95 పరుగుల తేడాతో అనంతపురం జిల్లా జట్టు రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టుపై ఘన విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దత్తారెడ్డి ఎంపికయ్యారు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని ఓపెనింగ్ బ్యాట్స్మెన్ నిఖిలేశ్వర్ రెడ్డి 38 పరుగులు, బ్యాట్స్మెన్లు పృథ్వీరాజ్ 112 పరుగులు, ధనుష్ 77 పరుగులు, వాసుదేవరాజు 30 పరుగులు సాధించారు. అనంతపురం జిల్లా జట్టు బౌలర్లు మల్లికార్జున రెండు వికెట్లు, మహేందర్ రెడ్డి ఒక వికెట్, జయంత్ కృష్ణ ఒక వికెట్, వినయ్ కుమార్ ఒక వికెట్ తీసుకున్నారు. సీనియర్స్ ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలలో అనంతపురం జిల్లా జట్టు మొదటి విజయాన్ని నమోదు చేసింది. అనంతపురం జిల్లా జట్టు తర్వాత మ్యాచ్ ప్రకాశం జిల్లా జట్టుతో 13వ తారీఖున ఆడనుంది. విజయం సాధించిన అనంతపురం జిల్లా సీనియర్ జట్టును ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

# ప్రముఖ సాహిత్య, సామాజిక సేవకులు ముడార్ వేణుగోపాల్ సేవలు చిరస్మరణీయం



నివాళులు అర్పిస్తున్న తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ సభ్యులు

అనంతపురం, జులై 11 ప్రభాతవార్త బ్యూరో

ముడార్ వేణుగోపాల్ 6వ వర్ధంతి సందర్భంగా స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్‌లో తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో విరసం పూర్వ సభ్యులు జెట్టి జయరాం, మానవతా రక్తదాతల కన్వీనర్ తరిమెల అమర్నాథ్ రెడ్డి, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కోటి గారి వన్నప్ప, సాహిత్య మిత్రులు, కుటుంబ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, పుష్ప గుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు జెట్టి జయరామ్, ఉమర్ అలీషా సాహితీ సమితి అధ్యక్షులు షేక్ రియాజుద్దీన్, ద్విభాషాకవి జూటూరు షరీఫ్, తెలుగు వెలుగు టివి రెడ్డి, అమర్నాథ్ రెడ్డిలు వేణుగోపాల్ తనయుడు ముడార్ సుధీర్ మాట్లాడుతూ.. వేణుగోపాల్ పేద కుటుంబం నుంచి ఎన్నో కష్టాలకు ఓర్చి ఎదిగిన నిగర్వి, నిస్వార్థపరుడు అన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం స్థాపించి విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై నిత్యం పోరాడిన యోధుడు ఆయన సాహిత్య, సామాజిక రంగాలకు ఎనలేని సేవలు అందించి, అందరి మధ్యలో చిరస్మణీయులైనరని పేర్కొన్నారు.

**ఉత్తమ లైబ్రేరియన్ వీఎం శ్రీపతికి సత్కారం :** ఒక గొప్ప రచయిత వర్ధంతి సందర్భంగా ఆయన స్ఫూర్తితో జిల్లా మహిళా గ్రంథాలయంలో ఉత్తమ సేవలు అందిస్తున్న లైబ్రేరియన్ వి.ఎం శ్రీపతి గారి సేవలు కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దివాపాకవి జూటూరు షరీఫ్, ఏపి నాగేంద్ర, లైబ్రేరియన్ శ్రీపతి, పూజారి ఈరన్న, చెట్ల వీరన్న, ఇంటాక్ జిల్లా కన్వీనర్ రామ్ కుమార్, గుడిపాటి సూర్యం, జిరసం నాయకులు గోసల నారాయణస్వామి, మధుర శ్రీ, చెట్ల ప్రవీణ్, కేఎల్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# యూట్యూబ్ ప్రశ్న రావణ్, ప్రముఖ జర్నలిస్టు కెవి రెడ్డిలపై అక్రమ కేసులు తగదు

## - అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జులై 11 ప్రభాతవార్త

యూట్యూబర్లు బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్, ప్రముఖ జర్నలిస్టు కె.వి.ఆర్‌లపై అక్రమంగా కేసులు నమోదు చేసి అరెస్టు చేయటాన్ని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ.ధనుంజయ, జి.దుర్గాప్రసాద్‌లు ఖండించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు ఒక కేసులో అరెస్టు చేయగా బుధవారం బెయిల్ పై విడుదలయ్యాడు. వెంటనే మరో కేసు పేరుతో పోలీసులు రావణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకువచ్చిన రావణ్ పై జనసేన కార్యకర్తలు దాడికి దిగటం దుర్మార్గం అన్నారు. అలాగే ప్రముఖ జర్నలిస్టు, డిజిటల్ మీడియా ఛానల్ నిర్వాహకులు కేవీ రెడ్డి తన చానల్లో ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గురించి రాజకీయ విశ్లేషణ చేయటం జరిగింది. ఆ విశ్లేషణపై ఏపీ పోలీసులు కేవీ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడాన్నీ తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమంగా కేసులు నమోదు చేయటాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్, ఉపాధ్యక్షులు తేజ ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు మోహన్, రాంబాబు, షామీర్, నగర కార్యదర్శి. ఆనంద్ బాబు, రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షులు ప్రసాద్, నియోజకవర్గ నాయకులు బాలాజి, నగర ఆర్గనైజేషన్ కార్యదర్శి. బండారు తేజ, నగర సహాయ కార్యదర్శి, యువ తేజ, నగర కోశాధికారి, రాంబాబు, కార్యవర్గ సభ్యులు, మోహన్ కృష్ణ, ప్రసాద్, సమీర్, వంశీ, నాని, గురు తదితరులు పాల్గొన్నారు.

# పంట బీమా రైతు భద్రతకు జీవనాధారం

## - మండల వ్యవసాయ అధికారి విజయకుమార్



మండల వ్యవసాయ అధికారి విజయకుమార్

పామిడి, జులై 11 ప్రభాతవార్త

పంట బీమా రైతు భద్రతకు జీవనాధారం అని మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ పేర్కొన్నారు. పంటలకు భీమా తప్పనిసరి అంటూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు పంట బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ శనివారం పత్రికలను విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పంట బీమా రైతుకు భరోసా కల్పిస్తుందని తెలిపారు. రైతులు స్వీయ దృవీకరణ పత్రం, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకంతో కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ)లో ధరఖాస్తు చేసి ఈనెల 15వ తేదిలోపు ఎకరా వేరువెనగకు రూ.640, పత్తికి రూ.1140, అరటికి రూ.3000, ఈనెల 31వ తేదిలోపు కందికి రూ.80, జొన్నకు రూ.84, మొక్కజొన్నకు రూ.132, అముదంకు రూ.80 ప్రీమియం చెల్లించాలన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావణశాఖ నిపుణులు తెలియజేస్తున్న నేపద్యంలో పంట బీమా రైతులకు ఆర్థిక రక్షణ కల్పిస్తుందని.. బీమా చేయించుకోండి రేపటి నష్టాన్ని నివారించుకోండి అని విజయకుమార్ పిలుపునిచ్చారు.

# విద్యతోనే ఉన్నత శిఖరాలు

## - ఘనంగా నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

అనంతపురం కల్చరల్, జులై 11 ప్రభాతవార్త

నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని జయమనెమ్మ కళ్యాణ మండపంలో ఉమ్మడి జిల్లాలో 10, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట రంగయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు రమణయ్య, గుంటూరు జిల్లా అధ్యక్షులు దేవప్రసాద్, రాష్ట్ర కోశాధికారి బాలతాత, కర్నూలు జిల్లా డీఎస్పి ఉపేంద్ర బాబు, ఎం.శైలజ, గౌరవ అధ్యక్షులు సుబ్రమణ్యం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివేకానంద స్వామి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి విజయనగరం నాగరాజు, గౌరవ సలహాదారులు శివప్రసాద్, కార్యదర్శి శివశంకర్, కోశాధికారి నాగరాజు, ఆర్గనైజింగ్‌కార్యదర్శి ఆర్టీసీ శ్రీనివాసులు, జె.వి.రమణ, శివయ్య, సాంబశివుడు, కడియాల కొండన్న డైరెక్టర్, తాడిపత్రి రమేష్ బాబు, కరెంట్ రామాంజనేయులు, ఉషాదేవి, హనుమేష్ బాబు, సత్యనారాయణమ్మ, మురళి, సాంబశివుడు, శివయ్య, గోపాల్, బిసివరదరాజులు, ఎం.నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..విద్యతోనే అత్యుత్తమ శిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్లో ఉత్తమ మార్కులు సాధించిన 35 మంది విద్యార్థులకు, పదవ తరగతిలో 53 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000 నగదు పురస్కారం, సర్టిఫికెట్ అందజేసి ప్రోత్సహించారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమం ఇలాగే కొనసాగిస్తామన్నారు. డి.ఎస్.పి ఉపేంద్రబాబు రానున్న విద్యా సంవత్సరానికి కూడా ఈ కార్యక్రమానికి చేయూతనందిస్తానని హామీ ఇచ్చారు. ముందుగా హార్ట్ ఫుల్ నెస్ ట్రైనర్ వివేకానంద స్వామి, విశ్రాంత అధ్యాపకురాలు పుష్పావతి ఆధ్వర్యంలో విద్యార్థులు వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి.

# కూటమి ప్రభుత్వంలో దళితుల భద్రత ఎక్కడ..?

నార్పల జులై 11, ప్రభాతవార్త



సంతకాల సేకరణ చేస్తున్న వైసీపీ నాయకులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దళితులపై దాడులు, హత్యలు, దౌర్జన్యాలు, అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చాములూరు రాజగోపాల్ మరియు మండల అధ్యక్షులు ప్రభుదాస్ శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులకు రక్షణ కల్పించడంలో మరియు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ద్వారా లభించిన జీవించే హక్కును పరిరక్షించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు విమర్శించారు. కూటమి ప్రభుత్వ దళిత, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా. నార్పల స్థానిక మహాత్మా గాంధీవిగ్రహం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. తొలుత నాయకులందరూ కలిసి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేతలు సంతకాలు చేసి ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాలు నార్పర సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ..కూటమి పాలనలో దళితుల భద్రత ఎక్కడ అని ప్రశ్నించారు .ప్రతిరోజూ దళితులపై దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నా చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వం, బాధితులకు అండగా నిలవాల్సింది పోయి... దాడులు చేస్తున్న వారికి కొమ్ముకాస్తోందన్నారు. ఆర్టికల్ 21 కల్పించిన జీవించే హక్కును ప్రతి ఒక్కరికీ వర్తింపజేయాలన్నారు. దళితులపై జరుగుతున్న అరాచకాలను ప్రజలందరూ గమనిస్తున్నారు, రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ , వైసీపీ మండల కన్వీనర్ ఖాదర్ వలీ, బండ్లపల్లి ప్రతాప్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రామాంజినేయులు, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు మంత్రి ఆంజనేయులు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు పట్నం పనింద్ర, వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి విష్ణు నారాయణ, పుట్లూరు ఎస్సీ సెల్ అధ్యక్షులు సూర్యనారాయణ, గార్లదిన్నె నారాయణస్వామి, మరియు వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీనుల విందుగా "వాగ్గేయకార వైభవం" సంగీత విభావరి

## - వాగ్గేయకారుల సంగీత వారసత్వాన్ని భావితరాలకు అందించాలి : హెచ్.కె.మధుసూదన్




భక్తి కీర్తనలు ఆలపిస్తున్న నిహాల్, శ్రవణానందం పొందుతున్న ఆహుతులు

అనంతపురం కల్చరల్, జూలై 11 ప్రభాతవార్త

శ్రీ జ్ఞానపీఠం వారి ఆధ్వర్యంలో అధ్యక్షులు హెచ్.కె.మధుసూదన్ ఆధ్వర్యంలో శనివారం అనంతపురంలోని జి.ఆర్. ఫంక్షన్‌హాల్‌లో వాగ్గేయ కార వైభవం భక్తి సంగీత విభావరి సంగీతా భిమానుల శ్రవణానందం కలగజేసింది. ప్రముఖ సినీ నేపథ్య గాయకులు కె.నిహాల్ తాళ్లపాక అన్నమాచార్యులు, త్యాగరాజ స్వామి, భద్రాచల రామదాసు, పురందర దాసు తదితర మహనీయ వాగ్గేయకారులు రచించిన సుమారు 30 భక్తి కీర్తనలను మధుర గాత్రంతో ఆలపించి సభికులను భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. కార్యక్రమం అనంతరం శ్రీ జ్ఞానపీఠం అధ్యక్షులు హెచ్.కె.మధుసూదన్ ప్రముఖ గాయకులు కె.నిహాల్‌ని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. భారతీయ సనాతన సంస్కృతి, వాగ్గేయకారుల భక్తి సంగీత వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.

**గాత్ర సహకారం :** కుమార్ జగన్నాథ్ మహేష్ సాయి నీల రమ్య శ్రీ వల్లిసుచరిత శృతి తన్వి శ్రీ కార్తీక వాద్య సహకారంను

**మృదంగం :** బాల సుబ్రహ్మణ్యం, రవి శంకర్, కళ్యాణ్ కుమార్, మంజునాథ్, నటరాజుతోపాటు సంగీత అభిమానులు ఆయన శిష్య బృందం తదితరులు పాల్గొన్నారు.

# శింగనమల చెరువును పరిశీలించిన మత్స్య శాస్త్ర వేత్త జ్ఞానేశ్వర్



మృతి చెందిన చేపలను పరిశీలిస్తున్న దృశ్యం

శింగనమల, జులై 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని శ్రీరంగరాయల చెరువులో కలుషిత నీటితో చనిపోతున్న జిలేబీ చేపలు అనే వార్త దినపత్రికలో రావడంతో శనివారం మత్స్యశాస్త్ర వేత్త జ్ఞానేశ్వర్ శింనమల చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన చెరువులోని నీటిని, మట్టి నమూనాలను తీసుకొని పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. చనిపోయిన చేపలను, గవ్వలను కూడా దుర్వాసన రాకుండా మత్స్యకారులు జెసిబిని ఏర్పాటు చేసి పక్కకు తొలగించారు.



జెసిబితో చనిపోయిన చేపలను, గవ్వలను పక్కకు తొలగిస్తున్న దృశ్యం

# న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలి : సాకే నరేష్




మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ సాకే నరేష్

అనంతపురం కల్చరల్, జూలై 11 ప్రభాతవార్త

బిసి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ సాకే నరేష్ మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో న్యాయవాదులపై అనుచితంగా దాడులు జరుగుతున్నాయని ఒకటి క్లయింట్ రూపంలో కొద్ది మంది తమకు నచ్చని, తమకు వ్యతిరేకంగా ఏదైన కేసు వేస్తే దాడులు చేస్తున్నారన్నారు. కొంత పొలిటికల్‌గా కూడా దాడులు జరుగుతున్నాయి. పోలీస్ వ్యవస్థలో కూడా వీటికి సరైన స్పందన లభించడం లేదన్నారు. ప్రభుత్వం న్యాయవాదుల వినతులను దృష్టిలో పెట్టుకొని రక్షణ చట్టం చేయాలని బిసి న్యాయవాదుల సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజి నేయులు, ప్రధాన కార్యదర్శి అశోక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కిశోర్, ట్రెజరర్ మహేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌ను వేగంగా చేపట్టాలి

## - తహశీల్దారు శేషారెడ్డి



బిఎల్ఓలతో మాట్లాడుతున్న తహశీల్దారు శేషారెడ్డి

శింగనమల, జులై 11 ప్రభాతవార్త

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని వేగవంతంగా గడువులోగా పూర్తి చేయాలని తహశీల్దారు శేషారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం మండల కేంద్రంలోని చిన్న కాలువ వీధిలో 85వ పోలింగ్ కేంద్రం పరిధిలో ఎస్ఐఆర్‌ను ఆయన తనిఖీ చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను సమీక్షించారు. అనంతరం ప్రజలతో మాట్లాడి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం, ఓటు ప్రాముఖ్యతను గురించి తహశీల్దారు శేషారెడ్డి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆర్ఐ విష్ణుతేజ్, బిఎల్ఓలు తిప్పేస్వామి, విరుపాక్షిరెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ సురేష్, హౌసింగ్ వర్క్ ఇన్స్‌పెక్టర్ రమేష్, టిడిపి నాయకులు మాసుల్ చంద్రమోహన్, శంకర్‌నారాయణ, బిఎల్ఏలు అబ్దుల్లా, మాసుల ప్రకాష్, వైఎస్ఆర్‌సిపి నాయకులు భాస్కర్‌రెడ్డి, ఓటర్లు పాల్గొన్నారు.

# గుండెపోటుతో ఆంధ్రజ్యోతి విలేకరి మృతి

శింగనమల, జులై 11 ప్రభాతవార్త



గుండెపోటుతో మృతి చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి నగేష్ (ఫైల్‌ఫోటో)

శింగనమల మండల ఆంధ్రజ్యోతి దినపత్రికలో విలేకరిగా విధులు నిర్వహిస్తున్న నగేష్ శనివారం వ్యక్తిగత పని నిమిత్తం నంద్యాలకు వెళ్లారు. సాయంత్రం ఆయన గుండె పోటు రావడంతో మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. పత్రికా రంగంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య కొన్ని సంవత్సరాలుగా సేవలు అందించిన పాత్రికేయుడు నగేష్ మరణం పత్రికా రంగానికి తీరని లోటు అని ఆయన ఆత్మకు శాంతి కలగాలని పలువురు రాజకీయ నాయకులు, ఉద్యోగులు, గ్రామస్తులు ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

# పెన్నహోబిళంలో వైభవంగా లక్ష్మినరసింహుని పల్లకీ ఉత్సవం

## - ఆకుపూజలు చేయించి మొక్కులు తీర్చుకున్న భక్తులు



లక్ష్మినరసింహస్వామి పల్లకీ ఉత్సవ దృశ్యం

ఉరవకొండ, జూలై 11 ప్రభాతవార్త

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో లక్ష్మినరసింహస్వామి ఆలయంలో లక్ష్మినరసింహస్వామి ప్రాకారోత్సవం స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సరం జేష్టమాసం ద్వాదశి శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల ్లకిలో కొలువుదీరి ్చ మేళతాళాల నడుమ పల్లకీ ఉత్సవం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున క్షేత్రానికి తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 106వ సారి రక్తదానం

నార్పల జులై 11, ప్రభాతవార్త



రక్తదానం చేస్తున్న పీటర్ విజయ్

106సార్లు రక్తదానంచేయడం చాలా ఆనందం గాఉందని నార్పలమండల ఐసిడిఎస్ సూపర్వైజర్ సునాలిని భర్త అబ్దుల్ కలాం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పీటర్ విజయ్ పేర్కొన్నారు. తాడిపత్రి నియోజకవర్గం పెద్దవడుగురు మండలం చిత్రచేడు గ్రామానికి చెందిన రామాంజినమ్మకి రక్తం చాలా తక్కువగాఉందని అనంత పురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్యులు సూచించారు. వెంటనే వారు ఏపీ ఎమ్మార్పీఎస్ సాకే ఓబిలేసు తరపున అబ్దుల్ కలాం స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత పీటర్ విజయ్ స్వయంగా వచ్చి106 సారి రక్త దానం చేశారు. పేషెంట్ బంధువులు పీటర్ విజయ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ




ర్యాలీ చేస్తున్న దృశ్యం

శింగనమల, జులై 11 ప్రభాతవార్త

తరిమెల పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం సంచార చికిత్స శిబిరం సందర్భంగా పెరవలిలో ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ప్రజల్లో కుటుంబ నియంత్రణ, తల్లి, శిశువు ఆరోగ్యం, బిడ్డకు, బిడ్డకు మధ్య సరైన ఎడం పాటించడంపై ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. దంపతులు, పిల్లల మధ్య ఎడం పాటించడం వల్ల తల్లి ఆరోగ్యం మెరుగు పడటంతోపాటు శిశువు సంపూర్ణ ఎదుగుదల సాధిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ గంగాధర్, ఎంపిహెచ్ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎన్ఎం నారాయణమ్మ, ఎంఎల్‌హెచ్‌పి అనూష, 104 సిబ్బంది నరహరి, ఆశలు, మండల పరిధిలోని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గుత్తి ఆర్టీసి డిపోలో ఘనంగా ఏపిపిటిడి వార్షికోత్సవ వేడుకలు

గుత్తి, జూలై 11 ప్రభాతవార్త



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని ఆర్టీసి డిపోలో శనివారం ఏపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ 75వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధుడు సూర్యనారాయణరెడ్డి పతాకావిష్కరణ గావించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం పోరాడుతోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, రీజనల్ ఉపాధ్యక్షులు హసన్ సాహెబ్, డిపో అధ్యక్షుడు వాసు, సీసీఎస్ డెలికేట్, పీకే రాముడు, శ్రీనివాసులు, ప్రసాద్, నాగార్జున, ఆరిఫ్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్‌చౌదరి, తదితర కార్మికులు పాల్గొన్నారు.

# సర్ క్యాంపు జనానికి...నిమ్మల శ్రీధర్ భోజన వసతి

గోరంట్ల, జూలై 11 ప్రభాతవార్త



భోజనాలు వడ్డిస్తున్న టిడిపి నేత నిమ్మల శ్రీధర్

గోరంట్ల పట్టణంలోని సంత మార్కెట్ వద్ద గల నాల్గవ సచివాలయం సమీపంలో శనివారం అధికారులు ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రక్రియ సర్వే స్పెషల్ క్యాంపుకు హాజరైన సిబ్బందికి మరియు పట్టణ వాసులకు టిడిపి సీనియర్ నాయకులు నిమ్మల శ్రీధర్ భోజనం వసతి కల్పించారు. మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు స్పెషల్ క్యాంపుకు వచ్చిన జనానికి గాని అక్కడ విధులు నిర్వహించే సిబ్బందికి గాని ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మధ్యాహ్నం భోజనవసతి ఏర్పాటు చేసినట్లు నిమ్మల శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మల శ్రీధర్‌తో పాటు బిజెపి మండల అధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ, బిజెపి జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బొట్టు శ్రీనివాసులు, పట్టణ సర్ కమిటీ సభ్యులు, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు దేవరకొండ ఉమాశంకర్, కలీం, సింగిరెడ్డిపల్లి శ్రీకాంత్, కలగేరి గంగిరెడ్డియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

04ATP13.qxd:04ATP13.qxd 12/07/26 10:55 PM Page 1



# నషా ముక్త్ భారత్ పోటీల్లో ధర్మవరం విద్యార్థినుల ప్రతిభకు జిల్లా స్థాయి గుర్తింపు

**కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీశ్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేత**

**చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి: కలెక్టర్ శ్యాంప్రసాద్**

**ప్రతిభకు క్రమశిక్షణ తోడైతే విజయాలు సొంతమవుతాయి - ఎస్పీ సతీశ్ కుమార్**

**ధర్మవరంటౌన్, జూలై 11 ప్రభాతవార్త**

విద్యార్థులు చదువుతో పాటు సాహిత్యం, కళలు, క్రీడలు తదితర అన్ని రంగాల్లోనూ ప్రతిభ కనబర్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలో ఖినషా ముక్త్ భారత్ అభియాన్ఖ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో ధర్మవరానికి చెందిన వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థినులు విశేష ప్రతిభ కనబర్చారు. వ్యాసరచన పోటీల్లో నాగవల్లి ప్రథమ స్థానం, అమృతసాయి ద్వితీయ స్థానం సాధించగా, చిత్రలేఖన పోటీల్లో భావన ప్రథమ స్థానం, జయలక్ష్మి ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ కరణం హర్షవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థినులకు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీశ్ కుమార్ చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం శనివారం కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గం ఇంచార్జ్ హరీష్ బాబు, ప్రిన్సిపల్ కరణం హర్షవర్ధన్, కళాశాల ఇన్‌చార్జ్ రమేశ్, అకడమిక్ ఇన్‌చార్జ్ కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాసులు విజేతలను ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




విజేతలైన ధర్మవరం వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీశ్ కుమార్.

# జిల్లాలో అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి

**- జిల్లాలో 18,258 మెట్రిక్ టన్నుల యూరియా 4,794 మెట్రిక్ టన్నుల డిఏపి అందుబాటులో ఉంది - ప్రెస్ మీట్ లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్**

**అనంతపురం కలెక్టరేట్ జులై 11 ప్రభాతవార్త**

అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం జిల్లాలో యూరియా పంపిణీ మరియు ఎలాంటి ఆటంకాలు లేకుండా రైతులకు యూరియా పంపిణీ చేయడానికి ప్రభుత్వం చేపట్టిన వివిధ సౌకర్యాలపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విజయనగరం మరియు శ్రీకాకుళం, కొన్ని జిల్లాల్లో గత కొద్ది కాలం క్రితం జరిగిన సంఘటనల నేపథ్యంలో యూరియాకి సంబంధించి కొన్ని ప్రతికూల వార్తా కథనాలు రావడం జరిగిందన్నారు. అందులో భాగంగా మన జిల్లాలో యూరియా పంపిణీ ఎలా చేస్తున్నామన్నది ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రెస్ మీట్ నిర్వహించామన్నారు. జూన్ 8 నుంచి మన రాష్ట్రంలో ఫర్టిలైజర్స్, యూరియా, డిఏపి పంపిణీ అన్నది ఏపీఎంఎస్ యాప్ ద్వారా చేపట్టడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు మొత్తం జిల్లాలో ఉన్న 3,91,215 మంది రైతులకు సంబంధించి 90 శాతం రైతులు ఈ సిస్టంలో భాగస్వామ్ అయ్యారు. 10 శాతం మంది ఎవరైతే ఉన్నారో వాళ్లు కూడా వచ్చే వారం, పది రోజుల్లోపు ఇందులో భాగస్వామ్యం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, అగ్రి ఎడి రాకేష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

# ప్రముఖ గాయని సుశీలా మృతి పట్ల ప్రొఫెసర్ సుధాకర్ బాబు సంతాపం



ప్రముఖ గాయని సుశీల (ఫైల్‌ఫోటో) , పదేళ్ల కిందట అనంతపురంలో ప్రముఖ గాయని సుశీలను ప్రొఫెసర్ సుధాకర్ బాబు సన్మానిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

**అనంతపురం కల్చరల్, జూలై 11 ప్రభాతవార్త**

సుప్రసిద్ధ ప్రముఖ గాయని సుశీల (88) అకాల మృతి పట్ల ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధాకర బాబు సంతాపం వ్యక్తం చేశారు. వివిధ భాషల్లో ఎన్నో పాటలతో అభిమానుల హృదయాల్లో గుండెల్లో నిలిచిపోయిన గాయని సుశీల మృతి తీరని లోటు అన్నారు. పది ఏళ్ల కిందట అనంతపురం నగరంలోని త్యాగరాజ గాన సభ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ప్రముఖ గాయని సుశీల ఇక్కడికి వచ్చారని, అప్పట్లో అనంతపురం ప్రజలు ఆదరించాలని, ఘనంగా సత్కరించామని ఆయన గుర్తు చేసుకున్నారు. నాతోపాటు మీటర్ ఇంజనీర్ సుధాకర్ బాబు తదితరులు కూడా అప్పట్లో సన్మాన కార్యక్రమంలో పాల్గొనట్లు ఆయన వివరించారు.

# పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం..

## - ఆనందోత్సాహాల నడుమ.. ఆలింగనాలు



మేథమేటిక్స్ టీచర్ రాజేంద్ర ప్రసాద్‌ను సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

**అనంతపురం కల్చరల్, జులై 11 ప్రభాతవార్త**

1992-05కు చెందిన ఎస్ఎస్‌బిఎన్ పూర్వపు విద్యార్థులు 31 సంవత్సరాల అనంతరం పూర్వ సమ్మేళనంలో శనివారం స్థానిక ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో అట్టహాసంగా ఆనందోత్సాహాల నడుమమ జరిగింది. ఈ వేడుకలోకు దాదాపు 52 మంది విద్యార్థులు హాజరు కాగా వీరికి విద్య, బుద్ధులు నేర్పించి ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. వీరిలో మేథమేటిక్స్ టీచర్ రాజేంద్ర ప్రసాద్, రవీంద్ర, ఫిజిక్స్ మునికృష్ణరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి స్టాటిస్టిక్స్, ప్రభాకర్‌రావు బోటనీ, మురళీ జువాలజీలు హాజరయ్యారు. ఈసమ్మేళనంలో ఎంపిసి,ఎంపిసి, బిజడ్సి మూడుగ్రూపుల విద్యార్థులు దాదాపు52 మంది కలిశారు. ఈసందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని, వారు చేస్తున్న వృత్తిని తెలియజేస్తూ ఆలింగనాలు చేసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందాన్ని వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా మేథమేటిక్స్ టీచర్ రాజేంద్ర ప్రసాద్‌ను పూర్వపు విద్యార్థులు శ్రీధర్‌తో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఒకొక్కక్కరు తమ జీవితాల్లోని అనుభవాలను ఎక్కడ ఏ వృత్తిలో స్థర పడ్డారు, ఏఊరిలో ఉన్నారు. అన్న వాటిని ఉపాధ్యాయులతోపాటు, తన తోటి స్నేహితులతో పంచుకుని మధుర జ్ఞాపకాలను తెలియజేశారు. ఈ సమ్మేళనంలో పూర్వపు విద్యార్థులు పార్థసారధి రెడ్డి సిఐ కర్నూలులో, జి.భాస్కర్ టీచర్ పత్తికొండ, విల్సన్ సుధీర్ లెక్చరర్ పత్తికొండ, జి.కేశవరెడ్డి సోమందేపల్లిలో టీచర్, చిన్నపరెడ్డి బిజిఎన్స్, వెంకటేష్ టీచర్, మృత్యుంజయ టీచర్, నాగార్జున రెడ్డిటీచర్‌నంద్యాల, ప్రభాకర్ అకౌంట్స్ ఆఫీసర్, ప్రతాప్ బిజినెస్ మ్యాన్, రామానాయుడు ఎస్‌బిఐ మేనేజర్, నారాయణరెడ్డి టీచర్, ఆదినారాయణరెడ్డి బిజినెస్ మెన్, రెడ్డెప్ప, దామోదర్‌బిజినెస్‌మెన్, జగదీష్‌బ్రిక్స్ ఫ్యాక్టరీ ఓనర్, సుబ్రహ్మణ్యం టీచర్‌కడప, సుబ్రహ్మణ్యం, నాగలింగయ్య టీచర్ డీ హీరేహాల్, కవిత హెచ్‌ఎం జల్లిపల్లి, శ్రీదేవి గ్రూప్-1 ఆఫీసర్, అరుణ,శ్రీలత, సులోచనరాణి టీచర్, రమేష్‌రెడ్డి, సురేష్ టీచర్, కాటమరాజు కూడేరు టీచర్, రవికుమార్ టీచర్ కళ్యాణదుర్గం, రవి టీచర్, శ్రీశైలం బిజినెస్ మెన్, నాగార్జునరెడ్డి నంద్యాలలో టీచర్, మొత్తం 52 మంది పాల్గొన్నారు.



పూర్వపు విద్యార్థుల సమ్మేళనంలోని పలు దృశ్యాలు

# వివాహ రిసెప్షన్‌లో బాలయ్య



వేడుకల్లో బాలయ్య

**హిందూపురం జులై 11 ప్రభాతవార్త**

హిందూపురం ప్రభుత్వాసుపత్రి రిటైర్డ్ సూపరెంటెంట్ డాక్టర్ కేశవులు కుమారుడు జయరామ్, శిల్ప వివాహ రిసెప్షన్ శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ఏర్పాటుచేసిన వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు బాలయ్య కాళ్ళు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీ తదితరులతో పాటు టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తచెరువు సచివాలయంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ..**



కొత్తచెరువు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్

**కొత్తచెరువు, జూలై 11: ప్రభాతవార్త**

జులై 14 వ తేదీ లోపు సర్ నమోదు పారాల డిజిటలైజేషన్ ప్రక్రియ ను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ అధికారులకు ఆదేశించారు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ శనివారం కొత్తచెరువు ఒకటవ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (SIR-2026) సర్వే పురోగతిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే రికార్డులను, ఎన్యూమరేషన్ ఫారాలను, ఓటర్ల వివరాల నమోదు లో నూతన ఓటర్లను నమోదు చేయడం మరణించిన వారినీ తొలగించడం తదితర వివరాల ప్రక్రియను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా సర్వే అత్యంత పారదర్శకంగా జరగాలని, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో తహసీల్దార్ , నారాయణరెడ్డి ఎంపీడీవో నటరాజ్ సచివాలయాల ఈఓలు, బీఎల్ఓలు, డిజిటల్ అసిస్టెంట్లు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విజేతగా నిలిచిన అండర్-19 బాలికల జట్టు




కప్పుతో జిల్లా బాలికల జట్టు

**అనంతపురం సిటీ, జులై 11 ప్రభాతవార్త**

ఏసిఏ సౌత్ జోన్ అండర్-19 మహిళల అంతర్ డిస్ట్రిక్ట్ క్రికెట్‌టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలిచి కప్పును కైవసం చేసుకుంది. చిత్తూరు జిల్లా వాయలపాడులో జరిగిన ఏసిఏ సౌత్‌జోన్ అండర్-19 టోర్నీలో అనంతపురం జట్టు ఆడిన అన్ని మ్యాచ్‌లలోనూ విజయం సాధించి కప్పును కైవసం చేసుకున్నారు. శనివారం నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 255 పరుగులు సాధించింది. అనంతపురం బౌలర్లు ధరమోహన్ 4 వికెట్లు, చక్రిక రెండు వికెట్లు, తేజశ్విని, మన్విక ఒక్కో వికెట్ సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 40.2 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 257 పరుగులు సాధించి విజయాన్ని అందుకుంది. విజేతగా నిలిచిన జట్టును ఏడిసిఏ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి అభినందించారు.

# రన్ అండ్ రైడ్ పోస్టర్ విడుదల చేసిన మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జే రత్నాకర్



పోస్టర్ ను విడుదల చేస్తున్న ఆర్జే రత్నాకర్.

**పుట్టపర్తి రూరల్ జూలై 11 ప్రభాతవార్త**

జూలై 26న పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో జరగనున్న శ్రీ సత్యసాయి రన్ అండ్ రైడ్ - స్పిరిట్ ఆఫ్ యూనిటీ" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఈరోజు శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జే రత్నాకర్ గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ ఆర్. జె. రత్నాకర్ గారు మాట్లాడుతూ, 15 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ ఉచిత కార్యక్రమానికి ముందుగానే నమోదు చేసుకుని, అత్యంత ఉత్సాహంతో పాల్గొని, భగవాన్ శ్రీ సత్యసాయి బోధించిన మానవతా సందేశాన్ని ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు.. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల జాతీయ సేవా విభాగం కోఆర్డినేటర్ ఎస్ కోటేశ్వర రావు గారు సత్యసాయి సేవా సంస్థలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు లి. లక్ష్మణ రావు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు సత్యనారాయణమూర్తి అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన విభాగ సమన్వయకర్త, సత్య సాయి జిల్లా సేవా విభాగం సమన్వయకర్త సీతారాములు పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

**చిలమత్తూరు, జూలై 11 ప్రభాతవార్త**

చిలమత్తూరు మండల కేంద్రంలోని 225, 208. 209 పోలింగ్ కేంద్రాల్లో శనివారం చేపట్టిన డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పరిశీలించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియపై జాయింట్ కలెక్టర్ బిఎల్ఒలు, సిబ్బందికి అవగాహన కల్పించారు. చిలమత్తూరు మండలంలో డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిపోయిన ఓటర్ల డిజిటలైజేషన్‌ను కూడా నిర్దేశిత గడువులోగా పారదర్శకంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.



సిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ...ఓటర్ల జాబితాలో ఉండాలి

**- పట్టణంలోని సంతవీధి సచివాలయంలో రెండు రోజుల స్పెషల్ సర్వే క్యాంపు**

**- ప్రక్రియను పరిశీలించిన పెనుకొండ ఆర్డీఓ ఆనంద్, టిడిపి నియోజకవర్గ అబ్జర్వర్ గోగిశెట్టి నరసింహారావు**

**- సర్వే సిబ్బందికి, హాజరైన ప్రజలకు...టిడిపి నేత నిమ్మల శ్రీధర్ భోజన వసతి**





సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ , సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న నియోజకవర్గ అబ్జర్వర్

**గోరంట్ల, జూలై 11 ప్రభాతవార్త**

ఓటర్ల సర్వే ప్రక్రియ ఆదివారంతో ముగుస్తుందని సర్వే ప్రక్రియలో అర్హుల పేర్లు గుర్తించి నమోదు చేయడానికి కొన్ని గంటల వ్యవధి ఉందని విధి నిర్వాహణలోని సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్వే ప్రక్రియ క్యాంపు పరిశీలనలో ఆర్డీఓతో పాటు అబ్జర్వర్ గోగిశెట్టి నరసింహారావుతో పాటు టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, జిల్లా కార్యదర్శి నరేష్, నిమ్మల శ్రీధర్‌లు ఉన్నారు. భారత ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో బిఎల్ఓల ఆధ్వర్యంలో జరుగుతున్న సర్ ఎన్నికల సమగ్ర సర్వే ప్రక్రియను పెనుకొండ నియోజకవర్గ టిడిపి అబ్జర్వర్ గోగిశెట్టి నరసింహారావు, పెనుగొండ ఆర్డీఓ ఆనంద్‌లు శనివారం పర్యవేక్షించారు. గోరంట్ల పట్టణంలోని సంత మార్కెట్ లో గల సచివాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సర్వే ప్రక్రియ సమావేశంలో బిఎల్ఓలు అంగన్వాడీ కార్యకర్తలు, యానిమేటర్స్, వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్ల ఆధ్వర్యంలో ఓటర్ల ప్రక్రియ నిర్వహించారు. మండల కేంద్రంలోని సంత మార్కెట్లో గల నాల్గవ సచివాలయంలో శనివారంనిర్వహించిన సర్వే కార్యక్రమంలో ఆర్డీఓఆనంద్ మాట్లాడుతూ రెండు రోజులపాటు ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఆదివారంతో ముగుస్తాయని ఇప్పటివరకు సర్వేలో పాల్గొన్నని ఓటర్లు ఈ ప్రత్యేక శిబిరంలో నమోదు చేసుకోవాలని కోరారు. గోరంట్ల పట్టణంలోని 21 పోలింగ్ బూత్‌లకు సంబంధించి స్పెషల్ క్యాంప్ నిర్వహించినట్లు తహాశీల్దార్ మధునాయక్ తెలిపారు. ఈ నేపథ్యంలో మండలము లోని బూదిలి గ్రామంలో సైతం నిర్వహిస్తున్న సర్వే స్పెషల్ క్యాంపు ప్రక్రియను ఆర్డీఓ ఆనంద్‌తో పాటు అబ్జర్వర్ నరసింహారావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్వే ప్రక్రియలు పాల్గొన్న సిబ్బందికి మరియు హాజరైన ప్రజలకు టిడిపి నేత నిమ్మల శ్రీధర్ భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ మధు నాయక్, ఎంపిడిఓ కమలాబాయి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి, టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, జిల్లా కార్యదర్శి నరేష్, నిమ్మల శ్రీధర్, మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బొట్టు శ్రీనివాసులు, ఎస్‌సి, ఎస్‌టి జిల్లా మానిటరింగ్ కమిటీ మెంబర్ ఉమాశంకర్, పసుపులేటి శ్రీనివాసులు, ఆగిశం నాగరాజు, గిరిధర్‌గౌడ్, జయరాం, అజంతుల్లా, వృషభదేవుడు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రామాంజినమ్మ, లక్ష్మీదేవమ్మ, నాగమణి, శ్రీకాంత్, గంగిరెడ్డి, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిని నీటి సంప్‌లోకి తోసేశారంటూ అందరినీ తప్పుదోవ పట్టించిన కొడుకు..!

**-రంగంలోకి పోలీస్, అగ్నిమాపకశాఖలు, రెండు గంటలపాటు ఉద్రిక్తత**

**-సంప్‌లో పడినట్లు చెప్పిన మహిళ పెద్దవడుగూరులో ఉన్నట్లు నిర్ధారణ**

**-తప్పుడు కథ అల్లిన మద్యం మత్తులో ఉన్న కొడుకు స్టేషన్ తరలింపు**

**ఉరవకొండ, జూలై 11 ప్రభాతవార్త**

తన తల్లి బండారు లక్ష్మీదేవితో పెదనాన్న, ఆమె కుమార్తె గొడవపడి నీటి సంప్‌లోకి తోసేశారంటూ ఆమె కొడుకు హరినాధ్ శనివారం తెల్లవారుజామున అల్లిన తప్పుడు కథనంతో ఉరవకొండ పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో రెండు గంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితోపాటు రంగంలోకి దిగిన పోలీస్, అగ్నిమాపకశాఖల సిబ్బంది వివిధ పద్దతుల్లో నీటి సంప్‌లోపడ్డ మహిళలను గుర్తించడానికి ప్రయత్నించగా ఫలితం లేకపోగా చివరికి తల్లి విషయంలో కొడుకు అల్లిన కథనం మొత్తం అబద్దమని అతని తల్లి పెద్దవడుగూరులో సురక్షితంగా ఉందని ఆమె ఉరవకొండకే రాలేదని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే...

ఉరవకొండకు చెందిన ప్రస్తుతం పెద్దవడుగూరులో ఉంటున్న బండారు లక్ష్మీదేవి కొడుకు హరినాధ్ శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని పెద్ద నీటి సంప్‌వద్దకు కేకలు పెడుతూ పరుగునవచ్చి అక్కడున్న సిబ్బందిని నిద్రలేపి తన తల్లిని పెదనాన్న, అయన కుమార్తె తోసేశారని తాను చేయిపట్టి బయటకు లాగేలోగా నీటిలో మునిగిపోయిందని కాపాడాలని గగ్గోలు పెట్టాడు. అంతే కాకుండా సమీప కాలనీలకు వెళ్లి బంధువులు, సన్నిహితులకు విషయం చెప్పి అందరినీ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం రప్పించాడు. ఈ క్రమంలోనే ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సంప్‌లోకి పీఏబీఆర్ నుండి జరుగుతున్న నీటి పంపింగ్‌ను నిలిపివేయించి టార్చ్‌లైట్లతో నీటిలో గాలించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో ఎస్ఐ పి.జనార్ధననాయుడు, అగ్రిమాపకశాఖ అధికారి ఎ.భీమలింగయ్య సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది తొలుత నిచ్చెనను నీటిలోకి దింపి కిందకు దిగి వరిశీలించినా సదరు మహిళ ఆనవాళ్ళు లభించకపోవడంతో లైఫ్ జాకెట్లు ధరించి నీటిలో గాలింపునకు సిద్దపడ్డారు. ఈక్రమంలో నీటి సంప్‌లోకి తన తల్లిని తోసేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న ఆమె భావను పోలీసులు అక్కడి రప్పించి విచారించగా కొడుకుపై పోలీసులకు అనుమానం బలమైంది. ఈక్రమంలోనే సదురు మహిళ సమీప బంధువుల సహకారంతో మహిళ నివాసం ఉంటున్న పెద్దవడుగూరుకు ఫోన్‌చేసి ఆరా తీయగా లక్షిదేవి ఉరవకొండకే రాలేదని తేలగా ఆమెతో వీడియో కాల్‌లో మాట్లాడించగా అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తల్లిను నీటి సంప్‌లో తోసేశారంటూ హంగామా చేసిన హరినాధ్ మద్యం, గంజాయి మత్తులో అందరినీ తప్పుదోవ పట్టించాడని స్పష్టం కావడంతో అతన్ని తీవ్రంగా మందలించిన పోలీసులు పోలీస్ స్టేషన్ తరలించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని నీటి సంపులో గాలింపు చర్యల్లో నిమగ్నమైన పోలీస్, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది



స్థానికుల సమక్షంలో మహిళ కొడుకు, బంధువులను విచారిస్తున్న అధికారులు



పెద్దవడుగూరులో సురక్షితంగా ఉన్న మహిళ లక్ష్మీదేవి



అందరినీ తప్పుదోవ పట్టించిన హరినాధ్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు